సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024



చెరువులో మద్యం సీసాలు


కాకినాడ జిల్లా తుని మండలం రాపాక గ్రామ శివారు చెరువులో మద్యం సీసాలు ఉండడంతో కలకలం రేగింది. పోలీసులు అనుమానితులపై కేసులు నమోదు చేశారు. - IIలో



శక్తి రూపిణీ శరణు శరణు

శక్తి రూపిణీ శరణు శరణు అంటూ ఆ దుర్గామాతను భక్తజనం పూజించింది. శరన్నవరాత్రుల్లో భాగంగా ఎనిమిదో రోజు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు. - IIలో

98 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం సాయంత్రం 98,536 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరుకుంది. డెల్టా కాలువలకు 12,200 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

రైల్వే లైన్ అలైన్‌మెంట్ సమస్యలు పరిష్కరించండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

సాక్షి, అమలాపురం: కోటిపల్లి– నరసాపురం రైల్వే లైన్‌కు ప్రతిపాదించిన అలైన్‌మెంట్‌కు సంబంధించి క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. అమలాపురం కలెక్టరేట్‌లో గురువారం రైల్వే లైన్ అలైన్‌మెంట్‌పై ఆయన మాట్లాడారు. భట్నవిల్లి– గుడిమెళ్లంక వరకూ ఉన్న ప్రతిపాదిత రైల్వే లైన్ అలైన్‌మెంట్ వెళుతున్న గ్రామాల్లో గత నెలలో వివిధ శాఖల అధికారులతో సర్వే చేశామన్నారు. అలైన్‌మెంట్‌లో సమస్యలను గుర్తించి జిల్లా యంత్రాంగానికి నివేదిక సమర్పించారని తెలిపారు. రాజోలు సమీపంలో పలుచోట్ల గెయిల్ పైప్ లైన్లు, మలికిపురం మండలం గుడిమెల్లంక గ్రామంలో పదెకరాల విస్తీర్ణంలో చెరువు ఉందని, ఆ చెరువుపై ప్రతిపాదిత రైల్వే లైన్ అలైన్‌మెంట్ వెళుతుందన్నారు. దీనిపై స్థానిక ప్రజలను ఒప్పించాల్సి ఉందన్నారు. సమస్యల పరిష్కారానికి ఆర్డీఓలు, తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్ మాట్లాడుతూ కోనసీమ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు తక్కువగా ఉన్నాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ రైల్వే లైన్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జేసీ టి.నిషాంతి, ఆర్డీఓలు కె.మాధవి, శ్రీకర్, కతీబ్ కౌశర్ బానో, రైల్వే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి.రామలింగరాజు పాల్గొన్నారు.

21 నుంచి వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు పందిరిరాట వేస్తున్న పండితులు, దేవస్థానం సిబ్బంది

ఆత్రేయపురం: ఏడు శనివారాల వెంకన్నగా ప్రసిద్ధి గాంచిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 21 నుంచి 29 వరకూ అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు దేవదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం చక్రధరరావు తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం పందిరి రాట కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో స్వామివారికి కల్యాణం, మహా సుదర్శన హోమం, అష్టోత్తర కలశాభిషేకం, సుప్రభాత సేవ, నవగ్రహ హోమం, లక్ష కుంకుమార్చన, మహాపుష్ప యాగం, శ్రీవేంకటేశ్వరస్వామి హోమం, సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ తదితర ఆర్జిత సేవలు నిర్వహిస్తారని ఈఓ వివరించారు.

మొగటికే మోసం..



మూలనపడి ఉన్న డ్రెడ్జింగ్ గొట్టాలు

- కూనవరం మొగ డ్రెడ్జింగ్‌కు హడావుడి
- డ్రెడ్జర్లను తీసుకొచ్చినా ఇంకా మొదలు కాని తవ్వకాలు
- వర్షాలొస్తే చేలు మునిగిపోతాయని రైతుల ఆందోళన



కూనవరం మేజర్ డ్రెయిన్‌లో డ్రెడ్జర్లు

సాక్షి, అమలాపురం/ ఉప్పలగుప్తం: చేసేది గోరంత.. హడావుడి మాత్రం కొండంత అన్నట్టు ప్రభుత్వ తీరు ఉంది. చంద్రబాబు పాలనలో పని చేసేది తక్కువైనా, ప్రచారం మాత్రం మహా గొప్పగా ఉంటోంది. తరచూ మూసుకుపోతున్న కూనవరం మొగ (స్ట్రైట్ కట్)ను డ్రెడ్జింగ్ చేసి తెరిపిస్తామని ప్రభుత్వం హామీలు గుప్పించింది. ఇందుకు అనుగుణంగా డ్రెడ్జర్లను సైతం ఆఘమేఘాలపై రప్పించింది. కానీ ఇంత వరకూ డ్రెడ్జింగ్ చేసిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో ఈశాన్య రుతు పవనాలతో భారీ వర్షాలు కురిస్తే ముంపు నీరు దిగే అవకాశం లేక రైతులు మరింత నష్టపోయే పరిస్థితి తలెత్తనుంది.

ఏడాదికి మూడు పంటలు పండే మధ్య డెల్టాలో ఖరీఫ్ వరి సాగు జూదంగా మారింది. మురుగునీటి కాలువల వ్యవస్థ అధ్వానంగా మారడమే అందుకు కారణం. ఇలా జిల్లాలోని తీర ప్రాంత మండలాల్లో రైతులు ఖరీఫ్ సాగు వదిలేస్తున్నారు. కొంతమంది రైతులు సాగు చేస్తున్నా వర్షాలకు చేలు ముంపుబారిన పడి నష్టపోవడం పరిపాటిగా మారింది. జిల్లా అంతా ఇదే పరిస్థితి ఉన్నా నాలుగు మండలాలకు చెందిన సుమారు 25 వేల ఎకరాల ముంపునీరు దిగే కూనవరం మేజర్ డ్రైన్ అధ్వానంగా మరింది. కబ్జాలు, పూడుకుపోవడంతో పాటు ముంపునీరు సముద్రంలో దిగేచోట ఉన్న మొగ ఇసుకతో పూడుకుపోయింది. సహజ సిద్ధంగా తెరుచుకోవడం, మూసుకుపోవడం ఈ మొగ లక్షణం. దీనికి శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉండగా, ఏటా తాత్కాలికంగా మొగ తవ్వకాలు చేసి వదిలేస్తున్నారు. ఈ ఏడాది కూడా మొగ మూసుకుపోవడం, తెరిచే ప్రయత్నాలు విఫలం కావడం జరిగింది. జూలై నెలాఖరులో కురిసిన భారీ వర్షాలతో చాలా వరకూ చేలు ముంపుబారిన పడ్డాయి. రైతుల నారుమళ్లు రెండుసార్లు దెబ్బతినడంతో చాలా మంది సాగుకు స్వస్తి చెప్పారు. రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో డ్రెయిన్స్ అధికారులు మొగను గత ఆగస్టు 14న తెరవడంతో ముంపునీరు సముద్రంలోకి వెళ్లింది. అయితే మొగ అదే నెల 19న పూడుకుపోవడం గమనార్హం. వర్షాలు లేని సమయంలో మొగ తవ్వకాలు చేయడంతో డ్రెయిన్ నుంచి నీరు వేగంగా సముద్రంలో కలిసే అవకాశం లేకుండా పోయింది. దీనికితోడు సముద్ర కెరటాలతో మొగలో ఇప్పుడు మూడు, నాలుగు అడుగుల ఎత్తున మేటలు వేయడంతో అధికారులు ఖంగుతిన్నారు.

రెండు నెలలు.. కదలని పనులు

రైతుల ఆందోళనల నేపథ్యంలో కూటమి ప్రభుత్వానికి చెందిన స్థానిక నేతలు, అధికారులు వచ్చి వాలిపోయారు. ఆఘమేఘాల మీద మొగ తవ్వకాలు చేస్తామని హామీలు గుప్పించారు. వారు చెప్పిందే తడవుగా ఒక కాంట్రాక్టర్ రెండు డ్రెడ్జర్లను తీసుకువచ్చి కూనవరం డ్రెయిన్‌లో అందుబాటులో ఉంచారు. తవ్వకాలకు డిపార్ట్‌మెంట్ పరంగా అనుమతులు లేవు. నిధులు కేటాయింపు లేదు. కాని మొగ వెంటనే తవ్వకాలు చేస్తున్నట్టు మాత్రం బిల్డప్ ఇచ్చారు. తమ ప్రభుత్వం తలుచుకుంటే పనులు ఇంత వేగంగా సాగుతాయని మాత్రం చెప్పుకొచ్చారు. రెండు నెలలు కావస్తున్నా తవ్వకాలు మాత్రం చేపట్టలేదు. గత సెప్టెంబరులో వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాలకు చేలు మరోసారి మునిగిపోయాయి. నష్టపోయిన చేలు నష్టపోగా, బతికి బట్టకట్టిన చోట దిగుబడి తక్కువగా వస్తోందని రైతులు వాపోతున్నారు.

అసలు కూనవరం మొగ తవ్వకాలకు చమురు సంస్థల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నుంచి నిధులు మంజూరు చేయించాలని స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తదితరులు పట్టుబట్టినా తాము ఇవ్వలేమని ఆ సంస్థ చేతులు ఎత్తివేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత డ్రెయిన్లలో పూడికతీత పనులకు నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో ఈ పనులు చేసే అవకాశం లేకపోవడంతో కూనవరం కాలువల్లో డ్రెడ్జర్లు పని లేకుండా పడిఉన్నాయి. గడిచిన రెండు నెలలుగా మొగ తవ్వకం పనులు చేపట్టకపోవడంపై ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు. అధికారుల తీరు చూస్తుంటే రబీ నాటికి కాని ఇక్కడ పనులు పూర్తయ్యే అవకాశం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పుడు చేసినా ఫలితం ఉండదని, కేవలం ఆక్వా రైతులకు మాత్రమే ప్రయోజనం కలుగుతోందని వారంటున్నారు. పైగా రబీ సమయంలో డ్రెయిన్ల ద్వారా ముంపునీరు వేగంగా ప్రవహించే అవకాశం లేనందున మొగ మరోసారి మూసుకుపోతోందని ఆయకట్టు రైతులు చెబుతున్నారు.



మూసుకుపోయిన కూనవరం మొగ

భారీ వర్షాలు కురిస్తే నష్టం

ఈశాన్య రుతుపవనాల వల్ల భారీ వర్షాలు కురిస్తే మిగిలిన ఖరీఫ్ చేలు కూడా ముంపు బారిన పడి నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో డ్రెడ్జింగ్ చేస్తే మంచిదని చాలా మంది రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో డ్రెడ్జింగ్ వల్ల నష్టపోతామని మరి కొంతమంది రైతులు ఆందోళన చేస్తుండడం విశేషం.

ప్రతి సీజన్‌లోనూ నష్టం



కూనవరం మేజర్ డ్రెయిన్ తవ్వకాలు చేపట్టకపోవడంతో ప్రతి సీజన్‌లో వరి సాగు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఖరీఫ్ మొదలు పెట్టే దశలో అధికారులు మొగను తవ్విస్తున్నామని ప్రచారం చెయ్యటంతో ఖరీఫ్ సాగు చేపట్టాం. ఇంతలో వచ్చిన వరదలు, వర్షాలకు వరి చేలలో నీరు దిగక పంట పూర్తిగా కుళ్లిపోయింది. ప్రస్తుతం డ్రెడ్జింగ్ పనులు చేయిస్తున్నామని డ్రెడ్జర్ తీసుకుని వచ్చి రెండు నెలలుగా హంగామా చేస్తున్నా నేటికి తవ్వకాలు పూర్తి కాలేదు. ఇలానే కొనసాగితే రబీ సాగు చేయడానికి రైతు ముందుకు వచ్చే పరిస్థితి లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి.

– యాళ్ల లక్ష్మీనారాయణ, రైతు, భీమనపల్లి, ఉప్పలగుప్తం మండలం

సమయానికి తవ్వకాలు జరపలేదు




నేను మూడున్నర ఎకరాల్లో వరి, 12 ఎకరాల్లో కౌలు సాగు చేస్తున్నాను. ఖరీఫ్ సాగు చేపట్టిన వెంటనే కురిసిన భారీ వర్షాలు, వరదలకు ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన నీటికి మా వరి పొలాలు నీట మునిగి తీవ్రంగా పంట నష్టపోయాం. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.96 లక్షలతో రంగరాజుకోడు తవ్వకాలు చేపట్టింది. అయినప్పటికీ కూనవరం మేజర్ డ్రెయిన్ తవ్వకాలు ప్రస్తుత ప్రభుత్వం ఇటీవల చేపట్టినా సమయానుకూలంగా చేపట్టకపోవడంతో పంటలు తీవ్రంగా నష్టపోతున్నాం. వెంటనే డ్రెడ్జింగ్ పనులు ప్రారంభించాలి.

– మారిశెట్టి నరేష్, రైతు, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం మండలం

వెంకన్న ఆలయానికి అనధికార నియామకమా..?

అమలాపురం టౌన్: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరు గాంచిన అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయానికి స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆదేశాలతో ఇన్‌చార్జి చైర్మన్‌గా టీడీపీ నాయకుడు జంగా అబ్బాయి వెంకన్నను నియమితులయ్యారు. దేవదాయశాఖ పరిధిలో ఉండే దేవాలయాలకు ధర్మకర్తల మండళ్ల నియమించేందుకు ప్రభుత్వం నుంచి ముఖ్యంగా రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ నుంచి లిఖిత పూర్వక ఉత్తర్వులు రావాలి. అన్నింటికీ మించి ధర్మకర్తల మండలి నియామకానికి ముందు దేవదాయ శాఖ నోటిఫికేషన్ జారీ చేయాలి. ఇవన్నీ లేకుండా ఎమ్మెల్యే ఆనందరావు ఆదేశాలతో ఇన్‌చార్జి చైర్మన్‌గా అబ్బాయి వెంకన్నను నియమించడంపై దేవదాయ అధికారులు మౌనంగా ఉండిపోయారు. ఇదే ఆలయానికి కూటమి మిత్రపక్షాలైన జనసేన, బీజేపీకి చెందిన నాయకులతో మరో ఐదుగురిని కమిటీ సభ్యులుగా నియమించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం నుంచి ముఖ్యంగా దేవదాయ శాఖ కమిషనర్ నుంచి ఇవే పేర్లతో ధర్మకర్తల మండలి నియామకం జరిగితే సరేసరి. నోటిఫికేషన్, వెరిఫికేషన్ లేకుండా నియామకాలు ఏం జరిగినా అవి అనధికార నియామకాలేనని ఆ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఎమ్మెల్యే ఇచ్చిన ఆదేశాలతో ఆలయానికి ఇన్‌చార్జి చైర్మన్‌గా నియమించిన నియామకంపై దేవదాయశాఖ అధికారులెవరూ వివరణ ఇచ్చేందుకు సాహసించలేకపోతున్నారు. ప్రత్యేక సందర్భాల్లో ఆలయాల ఉత్సవ కమిటీలకు నియామకాలు చేయడం ఎమ్మెల్యేలకు అధికారం ఉంటుంది. అయితే ఆలయ ధర్మకర్తల మండళ్లకు (ట్రస్ట్ బోర్డులు) నియామకాలకు సంబంధించి ఎమ్మెల్యేలు సిఫార్సులు మాత్రమే చేస్తారు. నియామక ఉత్తర్వులను అధికారిక ప్రక్రియ ద్వారా రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ జారీ చేయాల్సి ఉంటుందని సంబంధిత శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఈ ఆలయ చైర్మన్ పదవి కోసం కూటమి పార్టీలకు చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే ప్రసన్నం కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తుండడం గమనార్హం.



అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం

రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలు ప్రారంభం

రామచంద్రపురం: స్థానిక శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ 9వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్–2024 పోటీలను గురువారం రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ ప్రారంభించారు. ముందుగా పట్టణానికి చెందిన సాయిరాం కోలాటం బృందంచే నృత్య ప్రదర్శనతో పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ రామచంద్రపురంలో బాస్కెట్ బాల్ అసోసియేషన్‌కు బీజం వేసిన నిర్వాహకులను అభినందించారు. తానూ వారి కృషిలో భాగం కావడం సంతోషంగా ఉందన్నారు. క్రీడా స్ఫూర్తితో అంతా ముందుకు సాగాలన్నారు. అనంతరం రెండు రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ బాస్కెట్ బాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి స్మారకంగా జరుగుతున్న ఈ పోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 8 బాలికల జట్లు, 11 బాలుర జట్లు పాల్గొంటున్నాయి. తొలిరోజు తూర్పుగోదావరి, కడప బాలికల జట్ల మధ్య పోటీ జరిగింది. ఎంపీ బోస్, మున్సిపల్ చైర్పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గరికిపాటి సూర్యనారాయణమూర్తి, డాక్టర్ కోట సునీల్, జీవీ రావు, బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర కార్యదర్శి గన్నమని చక్రవర్తి, ఉపాధ్యక్షుడు జి.భూషణ రావు, టెక్నికల్ కమిటీ చైర్మన్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



బాస్కెట్ బాల్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీ సుభాష్ చంద్రబోస్

పనుల్లేక అల్లాడుతున్న నిర్మాణ రంగ కార్మికులు

అమలాపురం టౌన్: జిల్లాలో ఎక్కడా ఇసుక నిల్వలు లేక భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక అల్లాడుతున్నారని అమలాపురానికి చెందిన వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా చేతివృత్తుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణ మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన అమలాపురంలో గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఇసుక లభ్యతపై ఎదురవుతున్న కష్టనష్టాల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ముందుగా ప్రభుత్వం ఇసుకపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి మూడు నెలలు దాటినా ఇసుక విధానం ఇంకా గాడిలో పెట్టలేకపోయిందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు ధరలు తగ్గిస్తామని, ఉపాధి కల్పిస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీలను ఆయన గుర్తు చేశారు. ఇసుక విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని ఆయన ధ్వజమెత్తారు. ఉచిత ఇసుక విధానం అమల్లోకి వస్తుందని, అటు భవన నిర్మాణాలు చేసే యజమానులు, భవన నిర్మాణ కార్మికులు ఎంతో ఎదురు చూస్తున్నా ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదని సూర్యనారాయణమూర్తి విమర్శించారు.

రక్షణను చేజేతులా నరికేసి..

- సరుగుడు తోటలను తొలగించి ఆక్వా సాగు
- తీరానికి ముంచుకొస్తున్న భారీ కోత

అల్లవరం: పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి.. ఇది కాస్త తీర ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. అలాంటి సమయంలో తీర ప్రాంతాన్ని సముద్ర కోత నుంచి కాపాడే రక్షణ కవచాలే సరుగుడు తోటలు. ప్రకృతి వైపరీత్యాల నుంచి తీర ప్రాంతాన్ని కాపాడుకునేందుకు దశాబ్దాల క్రితమే ఈ తోటలను ఏర్పాటు చేశారు. ఇవి సముద్రం నుంచి వచ్చే బలమైన గాలుల తీవ్రతను తగ్గించి నష్టాన్ని నివారించడం, పంటలను ఉప్పు గాలి నుంచి కాపాడడం చేస్తున్నాయి. ఈ తోటలపై తీర ప్రాంత వాసులు ఆదాయం కూడా పొందేవారు. కాలక్రమేణా తోటలు గిట్టుబాటు కాక వాటి స్థానంలో ఆక్వా సాగుకు తెర తీశారు.

జిల్లాలోని ఏడు మండలాల్లో 45 కిలోమీటర్ల పొడవున తీర ప్రాంతం విస్తరించి ఉంది. దీనికి రక్షణగా 1,200 హెక్టార్ల విస్తీర్ణంలో ప్రభుత్వ భూముల్లో సరుగుడు తోటలు ఉన్నాయి. ఇవి కాకుండా తీరం పొడవునా జిరాయితీ భూముల్లో వందలాది మంది రైతులు సరుగుడు తోటలను సాగు చేశారు. రెండు దశాబ్దాల కిందటి వరకూ ఈ తోటలు తీరానికి ఆభరణంగా ఉండేవి. అయితే తోటలపై ఆదాయం రావడానికి ఎనిమిది నుంచి పదేళ్ల సమయం పట్టే అవకాశం ఉండడంతో గిట్టుబాటు కావని, ఆక్వా వైపు దృష్టి సారించారు. తీరం పొడవునా ఈ తోటలను అడ్డుగోలుగా నరికి, వాటి స్థానంలో ఆక్వా చెరువులను తవ్వేశారు. సరుగుడు సాగుతో పదేళ్లయినా రాని ఆదాయం ఆక్వాతో నాలుగు నెలలకే వస్తుందని చెరువులను అడ్డుగోలుగా ఏర్పాటు చేశారు. తీరానికి రక్షణగా ఉన్న సరుగుడు తోటలను తొలగించడంతో వేరు వ్యవస్థ కనుమరుగై ప్రకృతి వైపరీత్యాల ప్రభావంతో భారీ కెరటాలకు తీరం కోతకు గురవుతోంది. 2004లో సునామీ వచ్చినప్పుడు తీరం పొడవునా సరుగుడు తోటలు విస్తరించి ఉన్నాయి. సునామీ తర్వాత తీరం భారీగా కోతకు గురవుతూ వస్తోంది. తీరంలో తోటల విస్తీర్ణం నానాటికీ తగ్గిపోవడంతో సముద్రం నుంచి వీచే ఉప్పు గాలితో పంటలపై తీవ్ర ప్రభావం పడింది. తీర ప్రాంత మండలాల్లో వరి తర్వాత ఎక్కువగా పండించే కొబ్బరి పంట దిగుబడి బాగా తగ్గటానికి కారణమైంది.



ఓడలరేవులో భారీ కెరటాల తాకిడికి కోతకు గురైన తీరం



అంతర్వేది పల్లిపాలెంలో తీరం పొడవునా ఆక్వా చెరువులు (ఫైల్)

చెరువులను తవ్వేసి..

జిల్లాలో తీర ప్రాంత మండలాలైన కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, ఐ.పోలవరంలలో సముద్ర తీరం పొడవునా విస్తరించి ఉన్న సరుగుడు తోటలను ధ్వంసం చేసి వాటి స్థానంలో చెరువులను తవ్వేశారు. దీనివల్ల సముద్రం నానాటికీ ముందుకు వస్తూ వేలాది ఎకరాల భూమిని తనలో కలిపేసుకుంది. రానున్న రోజుల్లో తీర ప్రాంత గ్రామాలు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు, అధికారులు స్పందించి తీరానికి రక్షణ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనుంది.

ఆసక్తి చూపడం లేదు



కొమరగిరిపట్నం శివారు సముద్ర తీర ప్రాంతంలో ఆల్ క్యాస్ట్ సంఘం పేరిట 170 ఎకరాల్లో సరుగుడు తోటలను పెంచేవారు. సునామీ తర్వాత 70 ఎకరాల తోట సముద్ర గర్భంలో కలిసిపోయింది. ఇప్పుడు వంద ఎకరాల్లో మాత్రమే ఉంది. సరుగుడుపై ఆదాయం పదేళ్ల వరకూ రాదు. దీంతో చాలామంది రైతులు ఆసక్తి చూపడం లేదు.

– పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, కొమరగిరిపట్నం, అల్లవరం మండలం

సరుగుడు తోటలకు నష్టం



జిల్లా వ్యాప్తంగా 1,200 హెక్టార్ల విస్తీర్ణంలో సరుగుడు తోటలు విస్తరించి ఉన్నాయి. అల్లవరం మండలం ఓడలరేవులోనే ఎక్కువ మేర తీరం కోతకు గురవుతోంది. తీరంలో కోత నివారణకు సరుగుడు తోటలతో పాటు తాటి చెట్లు, చిత్తడి నేలలు ఉన్న ప్రాంతాల్లో మడ అడవులను పెంచాలి.

– ప్రసాదరావు, జిల్లా అటవీశాఖాధికారి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి
భార్యకు తీవ్ర గాయాలు


జగదీష్ (ఫైల్)

నల్లజర్ల: బైక్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన నల్లజర్లలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలో ప్రకాశరావు పాలెం గ్రామానికి చెందిన నారకొండ జగదీష్ (40) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం అక్కడి సాయిబాబా ఆలయంలో అన్నదాన కార్యక్రమం ముగించుకుని భార్య జయలక్ష్మికి అస్వస్థతగా ఉండటంతో బైక్‌పై వీరిద్దరూ నల్లజర్ల వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో నల్లజర్ల శివారులో ఉన్న పోలవరం కాలువ వంతెన సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను అధిగమించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంలో ట్రాక్టర్ ఢీకొనడంతో బైక్‌పై ఉన్న జగదీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన జయలక్ష్మిని చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, జగదీష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ప్రమాదం ఏవిధంగా జరిగిందనే దానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

చీటింగ్ కేసులో నిందితురాలి అరెస్ట్

సామర్లకోట: చీటింగ్ కేసులో ఓ మహిళను అరెస్ట్ చేసినట్లు సామర్లకోట సీఐ ఎ.కృష్ణభగవాన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ప్రభుత్వ పథకాలకు సొమ్ము వచ్చే విధంగా చేస్తానని జి.మేడపాడులో వీరంపాలెం పాకలు గ్రామానికి చెందిన బొక్కి సుందరమ్మను మోసం చేసి బంగారు ఆభరణాలను సామర్లకోటకు చెందిన గంటా చెంగా తీసుకుపోయినట్లు ఫిర్యాదు అందింది. ఈ మేరకు సీఐ గంటా చెంగాను విచారణ చేయగా నేరం రుజువు అయ్యింది. వీటితో పాటు అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధి కత్తిపూడిలో ఓ మహిళను మోసం చేసి బంగారు చెవి దుద్దులు, మండపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ వద్ద నుంచి చెవిదుద్దులను తీసుకుపోయింది. ఈ మేరకు నిందితురాలి నుంచి 34.8 గ్రాముల బంగారం, 10 తులాల వెండిని పోలీసులు రికవరీ చేశారు. చెంగాను కాకినాడ కోర్టుకు తరలించగా, రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కరప: ఉప్పలంక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడగా, కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కరప ఎస్సై టి.సునీత కథనం ప్రకారం.. యానాంకు చెందిన శ్రీదేవి తన కుమార్తె లక్ష్మీతులసి, మనుమరాలితో కలసి బుధవారం రాత్రి ఆటోలో సామర్లకోట మండలం మాధవపట్నం గ్రామానికి బయలుదేరారు. ఉప్పలంక వై.జంక్షన్ వద్దకు వచ్చేసరికి తోపుడుబండి అడ్డురావడంతో ఆటో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఆటోలో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి వారిని ఆసుపత్రికి తరలించారు. గురువారం బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

శక్తి రూపిణీ శరణు శరణు

శక్తి రూపిణీ శరణు శరణు
అంటూ ఆ దుర్గామాతను భక్తజనం పూజించింది. శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రముఖ దేవాలయాలు, ఉత్సవ మంటపాల్లో వేడుకలు అంబరాన్నంటాయి. ప్రధానంగా దుర్గాదేవిగా అమ్మవారిని అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు.


అమలాపురం శ్రీదేవి అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు


సామర్లకోట పంచారామ క్షేత్రంలో దుర్గమ్మగా బాలాత్రిపుర సుందరి అమ్మవారు



రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో దుర్గామాతగా బాలాత్రిపుర సుందరీదేవి


శుంభల, నిశుంభుల వధ అలంకరణలో కాకినాడ బాలాత్రిపుర సుందరి అమ్మవారు


తిమ్మరాజుపాలెంలో ప్రత్యేక పుష్పాలంకరణలో కోటసత్తెమ్మ


దుర్గాదేవి అలంకరణలో లోవ తలుపులమ్మ వారు


అన్నవరం వనదుర్గమ్మకు దుర్గామాతగా అలంకరణ


దుర్గాదేవి రూపంలో వెదురుపాక విజయదుర్గమ్మ వారు


రాపర్తిలో దుర్గామల్లేశ్వరి దేవికి రూ.15 లక్షల కరెన్సీతో ప్రత్యేక అలంకరణ

ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం


మహిళా రైతులతో మాట్లాడుతున్న కేరళ బృంద సభ్యులు

అల్లవరం: అల్లవరం మండలం కోడూరుపాడులో పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై కేరళ రాష్ట్రానికి చెందిన ఐదుగురు సభ్యులతో కూడిన బృందం గురువారం అధ్యయనం చేసింది. కోడూరుపాడులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను వారు సందర్శించి స్థానిక రైతుల నుంచి సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఈ సాగు విధానం, ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే మొక్కల నుంచి ఎరువులు, క్రిమి సంహారకాలు ఎలా తయారు చేయాలో రైతులను అడిగారు. ఏపీ తరహాలో కేరళ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు అధ్యయనం చేసేందుకు ఇక్కడికి వచ్చామని బృందం ప్రతినిధులు తెలిపారు. అనంతరం అల్లవరంలో మహిళా మండల సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా సంఘాలతో సమావేశమయ్యారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళా రైతులను సంఘాలుగా ఏర్పాటు చేసి వారికి రుణాలు మంజూరు చేస్తున్నామని ఏపీఎం సయ్యద్ కేరళ బృందానికి తెలిపారు. కేరళకు చెందిన వినోద్, రజిని, కవిత, అప్పకుట్టి, గిరిజా, జి.శ్రీనివాసరావు, చంద్రబాబు, డీపీఎం ఎంపీవీ సత్యనారాయణ, ఏఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీపాదుకా భీమనాథం గ్రంథావిష్కరణ


ద్రాక్షారామలో గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఈఓ దుర్గాభవాని, కొల్లూరు అవతార్ శర్మ గురూజీ తదితరులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ క్షేత్ర చరిత్ర, స్థల పురాణం, పూజా విధానం, స్తోత్రాలతో కూడిన శ్రీపాదుకా భీమనాథం గ్రంథాన్ని ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని చేతుల మీదుగా మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ కాశీ క్షేత్రానికి చెందిన శ్రీపాదుకా ఆచార్య కొల్లూరు అవతార్ గురూజీ చక్కని గ్రంథాన్ని రచించడంతో పాటు దసరా శరన్నవరాత్రుల పర్వదినాలను పురస్కరించుకుని ద్రాక్షారామ క్షేత్రంలో సతీమణి వెంకట రమణమ్మ సమేతంగా శిష్య బృందంతో కలసి లోక కల్యాణార్థం చండీ హోమం నిర్వహిస్తున్నారన్నారు. అదే విధంగా శ్రీపాదుకా ఆచార్య కొల్లూరు అవతార్‌శర్మ గురూజీ స్వయంగా రచించిన శ్రీపాదుకా భీమనాథం గ్రంథాన్ని ఆవిష్కరించడం ఆనందాయకమన్నారు. కార్యక్రమంలో శ్రీరాజరాజేశ్వరి పీఠాధిపతి తాళ్ల సాంబశివరావు గురూజీ, పలువురు కాశీ వాసులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


దంపనబోయిన శివ (ఫైల్)

దేవరపల్లి: ఆర్థిక ఇబ్బందులతో దేవరపల్లి మండలం సంగాయగూడేనికి చెందిన దంపనబోయిన శివ (32) బుధవారం ఇంటి వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వెంటనే అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చాగల్లులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం అతను మృతి చెందినట్టు ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన వివరించారు. మృతుడు శివ జంగారెడ్డిగూడెంలోని ఫైవ్‌స్టార్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నట్టు ఆయన చెప్పారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెంలో ఆర్టీసీ బస్సు ఢీకొని తణుకుకు చెందిన చల్లా కాశీవిశ్వనాథ్ (70) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తణుకు పట్టణానికి చెందిన కాశీవిశ్వనాథం దేవరపల్లిలోని తన కుమార్తె ఇంటి వద్ద ఉంటున్నారు. గురువారం యర్నగూడెంలో రోడ్డు దాటుతుండగా నిడదవోలు డిపోనకు చెందిన బస్సు నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఢీకొంది. ఈ ప్రమాదంలో కాశీవిశ్వనాథం తలకు తీవ్ర గాయం కాగా చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

శివలింగం అపహరణపై ఫిర్యాదు

కాకినాడ క్రైం: కాకినాడ సూర్యారావుపేట బాలాత్రిపుర సుందరి శివాలయ కోనేరు ఆవరణలో ఏకశిల నాగశివలింగం అపహరణపై టూ టౌన్ పోలీసులు ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించారు. సామాజిక వేత్త, ఆధ్యాత్మిక ఉపాసకుడు దూసర్లపూడి రమణరాజు కలెక్టర్ షణ్మోహన్‌కు అందించిన ఫిర్యాదు ఆధారంగా ఈ విచారణ ప్రారంభమైంది. ఇందులో భాగంగా ఫిర్యాదుదారు రమణరాజు నుంచి గురువారం టూ టౌన్ సీఐ అప్పలనాయుడు వివరాలు సేకరించారు. 2018లో ముగ్గురు పీఠాధిపతులు మూడు రోజుల పాటు యాగాలు నిర్వహించి, కోనేరుకు నైరుతిలో నాగ శివలింగాన్ని ప్రతిష్ఠించారని రమణరాజు తెలిపారు. కోనేరు నిర్వహణ లేక పీఠాధిపతులు ప్రతిష్ఠించిన నాగశివలింగం అపహరణకు గురైందన్నారు.

రైస్ మిల్లుల యజమానులపై కేసులు

దేవరపల్లి: రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం రాత్రి దేవరపల్లిలోని రెండు, అనంతపల్లిలో ఒక రైస్ మిల్లుపై మెరుపు దాడి చేశారు. అక్కడ అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యంతో పాటు పలు అవకతవకలు గుర్తించారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ మేరకు జేసీ చిన్నరాముడు గురువారం విచారణ చేశారు. అనంతపల్లిలోని మద్దు సత్యనారాయణకు చెందిన శ్రీవేంకట సత్యామిల్లులో రూ. 36.40 లక్షల విలువైన 80 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్టు గుర్తించామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. గతంలో రెవెన్యూ అధికారులు 270 కిలోల బియ్యాన్ని సీజ్ చేసి, దానిని దేవరపల్లిలోని చెలంచర్ల అప్పారావుకు చెందిన వరలక్ష్మీ రైస్‌మిల్లులో భద్రపరచాలని సూచించారు. ఆ బియ్యం లేకపోవడంతో కేసు నమోదు చేశారు. 2021లో 16 మెట్రిక్ టన్నుల పీడీఎస్ బియ్యం అధికారులు సీజ్ చేసి దేవరపల్లిలోని చలంచర్ల హరిబాబుకు చెందిన శ్రీవేంకటేశ్వర రైస్ మిల్లులో భద్రపర్చారు. దీనికి సంబంధించిన బియ్యం నిల్వలు ఉన్నప్పటికీ రికార్డు లేనందున తదుపరి చర్యలు తీసుకుంటామని జేసీ తెలిపారు.

నల్లజర్ల: నల్లజర్లలో మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేసిన సందర్భంలో అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం లెక్కింపు కొనసాగుతోంది. గురువారం సాయంత్రం 7 గంటలకు 50 కిలోల బస్తాలు 912 వరకూ ఉన్నట్లు గుర్తించారు. ఈ లెక్కింపు రాత్రి 12 గంటల వరకు ఉంటుందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ కాంతిప్రియ తెలిపారు.

యువతకు ఉద్యోగావకాశాలు

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డైకిన్ ఆధ్వర్యంలో డిప్లొమా (మెకానికల్/ ప్రొడక్షన్ / ఆర్‌ఏసీ/ ఆటోమొబైల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్), బీఎస్సీ (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్) చదివిన వారికి ఆపరేటర్ (ప్రొడక్షన్ / క్వాలిటీ) ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆపరేటర్‌గా పనిచేయడానికి ఆసక్తి కలిగిన 18–25 ఏళ్లలోపు యువతీ యువకులు అర్హులన్నారు. నెలకు రూ.12,435, బెనిఫిట్స్, రవాణా, భోజనం, యూనిఫాం, 14 రోజుల ట్రైనింగ్ ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులకు శ్రీసిటీలో 14న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 91544 49677, 94403 74535 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

• మనసు మురిసే వేళ..



మనసుకెంత సంతోషమో కదా.. నీలాకాశాన్నే చూడాలా.. పచ్చని పైర్లలో అలాఅలా తిరగాలా.. మబ్బుల మంచెపై సయ్యాటలాడాలా.. ఏదీ నిర్ణయించుకోలేక ఎంత ఉబలాటపడుతుందో కదా.. ఈ ప్రకృతి చిత్రంలో ఒకదాన్ని మించిన అందం మరొకదానిది. చూసిన కళ్లకి ఎంత ఆనందమో.. ఆలమూరు మండలం మడికి నుంచి కడియం మండలంలోని దుళ్ల వెళ్లే రోడ్డులో కనువిందు చేసిన నేలా.. నీలాకాశాలు.. **–ఆలమూరు**

చెరువులో మద్యం సీసాలు
ఎగబడిన జనం


మద్యం సీసాలు వేసింది ఈ చెరువులోనే..

తుని రూరల్: కాకినాడ జిల్లా తుని మండలం రాపాక గ్రామ శివారు చెరువులో మద్యం సీసాలు ఉండడంతో కలకలం రేగింది. గడిచిన రెండు రోజులు రాపాక సమీప గ్రామం కేఓ మల్లవరంలో మద్యం అక్రమ నిల్వలతో పట్టుబడిన నలుగురిపై రూరల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. దీంతో భయాందోళన చెంది పరారైన అక్రమ వ్యాపారులు మద్యం సీసాలను రాపాక శివారు చెరువులో వేసినట్టు తెలుస్తుంది. పది నుంచి 15 మూటల్లో మద్యం సీసాలు పడేసినట్టు స్థానికుల నుంచి అందిన సమాచారం బట్టి తెలిసింది. గురువారం ఉదయం అటుగా వెళ్తున్న కొంతమంది చెరువులో నీటిపై తేలిన మద్యం సీసాలను గుర్తించారు. ఈ విషయం గ్రామస్తులకు, అటుగా వెళుతున్న వారికి తెలియడంతో మద్యం సీసాల కోసం ఎగబడ్డారు. దీంతో చెరువులోకి దిగి కొంతమంది మద్యం ప్రియులు సీసాలను గంట వ్యవధిలోనే తస్కరించారు. ఈ విషయం తెలియడంతో రూరల్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ నిర్వహించారు. అక్రమ మద్యం కలిగి ఉన్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి స్థానికుల నుంచి నాలుగు మూటల్లో మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

వ్యాపారిని అడ్డగించిన నలుగురి అరెస్ట్

ప్రత్తిపాడు: స్థానిక జాతీయ రహదారిపై పశువుల వ్యాన్‌ను అడ్డగించిన కేసులో నలుగురిని అరెస్టు చేయగా, మరొకరు పరారీలో ఉన్నాడని ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు గురువారం తెలిపారు. ఈ నెల 7వ తేదీ అర్ధరాత్రి సమయంలో విజయనగరానికి చెందిన గొలగాని ఆదినారాయణ తన బొలెరో వాహనంలో పశువులను హనుమాన్ జంక్షన్‌కు తీసుకు వెళ్తున్నాడు. స్థానిక ఎన్‌హెచ్‌పై నరేంద్రగిరి వద్ద ఐదుగురు కారులో వచ్చి, బొలెరో వాహనాన్ని అడ్డగించి, లంపకలోవ వెళ్లే రోడ్డులోకి తీసుకుపోయారు. ఆ దారిలో మామిడితోట వద్ద బొలెరో డ్రైవర్‌ను చంపుతామని బెదిరించి, అతని నుంచి రూ. 10 వేలు తీసుకున్నారు. ఈ మేరకు ఆదినారాయణ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. నిందితులు జల్లూరుకు చెందిన గున్నబత్తుల శివ, గోరింటకు చెందిన కలగా హరీష్, విరవాడకు చెందిన కందా పాపారావు(పవన్), గోరింట గ్రామానికి చెందిన కర్రి శివలను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10 వేలు, పశువులు, నిందితులు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు. ఎస్.తిమ్మాపురానికి చెందిన మరో నిందితుడు కుంచే ఆనంద్ పరారీలో ఉన్నాడని సీఐ తెలిపారు.